క్లుప్తంగా

విగ్రహావిష్కరణ..



అభిషేకం చేస్తున్న భక్తులు

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా మందిరాన్ని గురువారం ప్రారంభించి.. మందిరంలో ఏర్పాటు చేసిన పాలరాతి విగ్రహాన్ని అర్చకులు ఆవిష్కరించారు. భక్తులు పలు రకాల అభిషేకాలతో పాటు ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో పుర వీధుల్లో సాయిబాబా చిత్ర పటాలను ఊరేగించారు. మందిరం అంతా సాయిబాబా నామస్మరణతో పులకించింది. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రావెళ్ల కృష్ణారావు, శంకర్‌రావు, చావా కోటయ్య, నున్నా రవికుమార్, చావా కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి విగ్రహం...

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్‌లోని శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణంలో దాతలు తొట్టి కొమరయ్య–ఉమారాణి, దొడ్డ శ్రీనివాస్–శ్రీలత దంపతులు అందించిన రూ. 2 లక్షలతో గోశాల నిర్మాణం చేపట్టారు. కాగా, రాజస్థాన్ నుంచి తీసుకొచ్చిన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని గురువారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో దాతలతో పాటు కార్పొరేటర్, దేవాలయ కమిటీ వారు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి వితరణ



ఆలయ కమిటీ వారికి
వితరణ అందజేస్తున్న అంజయ్య

ఖమ్మంఅర్బన్: నగరంలోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు మూడో రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా భక్తులు నూతన దేవాలయ నిర్మాణం కోసం దాత అల్లిక అంజయ్య, మంగమ్మ దంపతులు రూ.25,116, బాలాజీనగర్ రామాలయ కమిటీ చైర్మన్ పంతంగి వెంకటేశ్వర్లు, నాగమణి దంపతులు రూ.10 వేలు ఆలయ కమిటీ వారికి అందజేశారు.కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

12న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఎంట్రన్స్ టెస్ట్

రఘునాథపాలెం: తెలంగాణ గిరిజన గురుకులం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఎంట్రన్స్ పరీక్ష –2023 (టీటీడబ్ల్యూఆర్‌సీఓఈ సెట్–2023) ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు కె. బాలస్వామి, కె.సత్యానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. 12న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్ష జరుగుతుందని పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం తొమ్మిది గంటల లోపు రిపోర్టు చేయాలని తెలిపారు. మరింత సమాచారం కొరకు 99482 45099, 83411 89638, 70324 50990 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పాలేరు సంత వేలం వాయిదా

కూసుమంచి: పాలేరులో ప్రతి శుక్రవారం జరిగే వారపు సంత వేలాన్ని గురువారం నిర్వహించగా.. కనీస మద్దతు ధర దక్కకపోవటంతో వేలాన్ని అధికారులు వాయిదా వేశారు. సంత వేలంలో పలువురు పాటదారులు పాల్గొనగా.. ప్రభుత్వ మద్దతు ధరను రూ.62.75 లక్షలుగా నిర్ణయించారు. కాగా, పాటదారులు రూ.26.10లక్షల వరకే పాట పాడటంతో వేలాన్ని తిరిగి వచ్చే మంగళవారానికి వాయిదా వేసినట్లు గ్రామ కార్యదర్శి నరేష్ తెలిపారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	66	పాలకూర	3
పచ్చిమిర్చి	34		20
కాకర	40	చుక్కకూర	2
బోడ కాకర	40		10
బీర	50	తోటకూర	2
దొండ	46		10
పొట్లకాయ	36	గోంగూర	2
చిక్కుడు	60		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	15		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		15
చామగడ్డ	64	పుదీన	1
క్యారెట్	20		15
క్యాప్సికం	60	–ఖమ్మం వ్యవసాయం	

చేపల మార్కెట్ జాడేది..?

చేపల విక్రయాలతోనే మత్స్యకారులకు జీవనోపాధి

- చేపలు కొనేందుకు పలు ప్రాంతాల నుంచి రాక
- మార్కెట్ లేక రోడ్ల వెంట అమ్మకాలు
- పాలేరులో అమలుకాని ప్రభుత్వ హామీ
- ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు



పాలేరులో చేపలు విక్రయించే స్టాల్స్

కూసుమంచి: జిల్లాలో ప్రసిద్ధి చెందిన వాటిలో పాలేరు రిజర్వాయర్ ఒకటి. ఇక్కడ చేపల విక్రయాలు నిత్యం జోరుగా సాగుతుంటాయి. పాలేరు చేపను రుచి చూడాలని పలు ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తుంటారు. కాగా, పాలేరు రిజర్వాయర్‌పై వందలాది మంది మత్స్యకారులు జీవనం ఆధారపడి ఉంటుంది. కానీ, చేపలు మార్కెట్ లేక పోవటంతో జీవనోపాధి నానాటికి తగ్గిపోతోంది. చేసేదేమిలేక కొందరు మత్స్యకారులు రిజర్వాయర్ ఎదురుగా ఖమ్మం–సూర్యాపేట రహదారి పక్కన చిన్నచిన్న స్టాల్స్ పెట్టుకుని విక్రయాలు చేపడుతుండగా.. మరికొందరు రిజర్వాయర్ ప్రాంతంలో, రోడ్ల మీద విక్రయాలు కొనసాగిస్తున్నారు. వినియోగదారులు ఎవరికి అవకాశం ఉన్న చోట వారు చేపలను కొని తెచ్చుకుంటున్నారు. గతంలో మార్కెట్ ఏర్పాటు చేస్తామని ఇచ్చన ప్రభుత్వ హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు.

మార్కెట్‌తో లాభదాయకం...

చేపల ఉత్పత్తి ఉన్న చోట మార్కెటింగ్ సౌకర్యం కూడా ఉంటే మత్స్యకారులకు ఆర్థికంగా ఎదుగుతారు. మార్కెట్ ఏర్పాటు చేస్తే నిర్ణీత ధరలకే చేపలను విక్రయించడంతో పాటు వినియోగదారులకు ఒకే చోట కోరుకున్న చేపలు లభిస్తాయి. ఇక ప్రభుత్వం నుంచి కూడా మత్స్యకారులకు ప్రోత్సాహకాలు అందుతాయి. మార్కెట్ ఏర్పాటుతో లైసెన్సులు పొందిన వారికే క్రయవిక్రయాలు జరిపే అవకాశం ఉంటుంది.

హామీలు ఇచ్చినా...

పాలేరులో చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని, మత్స్యకారులు తమ వ్యాపారాలను వృద్ధి చేసుకోవాలని నాటి పాలేరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో హామీ ఇచ్చారు. ఇందుకు అనువైన స్థలాన్ని చూడాలంటూ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అయినా చేపల మార్కెట్‌లో కదలిక రాలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకురాగా ఆయన మార్కెట్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. కానీ, మార్కెట్ నిర్మాణం చేపట్టలేదు. వెంటనే ఇచ్చిన మాటకు కట్టుబడి మార్కెట్ నిర్మించాలని మత్స్యకారులు కోరుతున్నారు.



చేపలు పడుతున్న మత్స్యకారులు (ఫైల్)

మార్కెట్ ఉంటే మేలు..

మాకు చేపల మార్కెట్ ఉంటే చాలా బాగుంటుంది. ప్రస్తుతం రోడ్ల పక్కనే చిన్నచిన్న స్టాల్స్ వేసుకొని చేపలు అమ్ముకుంటున్నాం. ప్రభుత్వం మార్కెట్ నిర్మించి మాకు ప్రోత్సాహకం అందించాలి. చేపల మార్కెటింగ్‌ను అభివృద్ధి చేయాలి.

– మారి పెద్ది నాగరాజు, మత్స్యకారుడు

పరిశీలన చేస్తున్నాం..

పాలేరులో చేపల మార్కెట్ ఏర్పాటుకు పరిశీలన చేస్తున్నాం. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరైతే మార్కెట్‌ను ఏర్పాటు చేసే వీలుంటుంది. మార్కెట్‌తో మత్స్యకారులకు ప్రయోజనంగా ఉంటుంది.

– ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పెన్షన్‌దారులు

నేలకొండపల్లి: పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా నాయకుడు ఏటుకూరి రామారావు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పెన్షన్‌దారుల పట్ల నిర్లక్ష్యం ధోరణి అవలంబిస్తుందని ఆరోపించారు. వివిధ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దశల వారీ పోరాటాలు చేస్తున్న ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని అన్నారు.వైద్య సౌకర్యం కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు చిట్టా భాస్కర్‌రెడ్డి, వల్లంచెట్ల భాస్కర్‌రావు, దాసరి స్వామినాథం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

రఘునాథపాలెం/కూసుమంచి: రఘునాథపాలెం, కూసుమంచి మండలాల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా రఘునాథపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రెంటాల ప్రసాద్, కూసుమంచి మండల జీళ్లచెరువు గ్రామానికి చెందిన కె. శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, నగర అధ్యక్షుడు మహ్మద్ జావిద్‌లు నియామక పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రసాద్, శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా బాలాజీ, ఈర్లాల కృష్ణ, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు బానోత్ వినోద తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో ఖమ్మం వాసి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో ఖమ్మంకు చెందిన వ్యక్తి(30)గా భావిస్తున్న ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్కడి స్టేషన్‌లో ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకోగా ఆయన షర్ట్ జేబులో సికింద్రాబాద్ నుంచి ఖమ్మం ప్రయాణ టికెట్ లభించింది. కాగా, సదరు వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు సికింద్రాబాద్ రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఫాసిస్టు వ్యతిరేక పోరాటాలు నిర్వహించాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఫాసిస్టు వ్యతిరేక పోరాటాలను నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) 7వ వర్ధంతి సభలో రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక మాట్లాడారు. ఎన్నో పోరాటాలఫలితంగా ప్రజాస్వామ్య హక్కులు ఆవిష్కరించబడ్డాయని, నేడు వాటిని పాలకులు హరిస్తున్నారని ఆరోపించారు. ఖమ్మం నగర కార్యదర్శి టి.ఝాన్సి, సహాయ కార్యదర్శి చందు, శ్రీనివాస్, కోమరన్న, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

14న తిరుపతికి చిమ్మపుడివాసులు



చిమ్మపుడిలోని కోలాట బృందం మహిళలు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడికి చెందిన మహిళలు తిరుపతిలో వెంకన్నస్వామి వద్ద తమ కళాప్రదర్శన ప్రదర్శించడానికి ఈనెల 14న తిరుపతికి పయనం అవుతున్నారు. గ్రామ ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఒక్క గ్రామం నుండే సుమారు 150 మంది కోలాట బృందం మహిళలు బయలుదేరుతున్నారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ.. ప్రదర్శనతో పాటు స్వామి దర్శనం, చార్జీలు, వసతి తదితర ఏర్పాట్లు ఉపసర్పంచ్ పర్యవేక్షణలో చేస్తుండగా.. కొంత మంది వృద్ధులను సైతం తీసుకెళ్తున్నట్లు ఉపసర్పంచ్ తెలిపారు. వీరందరికి ట్రైన్ టిక్కెట్లు రిజర్వేషన్ చేయించగా.. తిరిగి 16న రానున్నట్లు ఉపసర్పంచ్ చెప్పారు.

జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక



కోయచలక విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం,ఉపాధ్యాయులు



తిరుమలాయపాలెం: బీరోలు పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రఘునాథపాలెం/కూసుమంచి/తిరుమలాయపాలెం: రఘునాథపాలెం మండలం కోయచలక ప్రభుత్వ పాఠశాల, కూసుమంచి జెడ్పీహెచ్‌ఎస్, తిరుమలాయపాలెం మండలం బీరోలు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్‌స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు. ఈమేరకు టాలెంట్ టెస్ట్‌లో విజయం సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎంలు అనిత, రేల విక్రమ్‌రెడ్డి, సతీష్‌రాజ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ద్రాక్షాయణి, రవి, శ్రీనాథ్, సత్య నిస్సీ, వడిత్య చరణ్, చింతిరాల హిమబిందు, సిద్దుల అజయ్, బోడ బన్నికుమార్‌కు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ద్వారా 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నెలకు రూ.వెయ్యి చొప్పున అందనున్నాయి. ఆయా విద్యార్థులను హెచ్‌ఎంలతో పాటు ఎంఈఓ బీ.వీ.రామాచారి, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్.కే.మైమూనా, ఎస్‌ఎంసీ చైర్మన్ పాదిల కరుణాకర్, టీచర్లు అభినందించారు.



వడిత్య చరణ్



సత్య నిస్సీ

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖమ్మం–వైరా ప్రధాన రోడ్డులో గల రఘునాథపాలెం బైపాస్ క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి.పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 26న పుట్టకోట నుంచి భార్యభర్తలు కుడికందుల వెంకన్న, నాగమణిలు నగరంలోని బల్లేపల్లిలో ఒక శుభకార్యానికి వస్తున్నారు. ఈక్రమంలో బైపాస్ క్రాస్‌రోడ్డు వద్ద వైరా వైపు నుంచి ఖమ్మం వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి నాటి నుంచి నేటి వరకు చికిత్స అందిస్తున్నారు. కాగా, గురువారం దంపతుల కుమార్తె రాజేశ్వరి ఖమ్మం అర్బన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి యత్నాలపై కేసులు

రఘునాథపాలెం: మండలంలోని రెండు గ్రామాల్లో వివాహితలపై అదే గ్రామాలకు చెందిన వారు లైంగిక దాడికి యత్నించినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం వేర్వేరుగా రఘునాథపాలెం పోలీసులు కేసులు నమోదు చేశారు. మండలంలోని బద్యాతండాకు చెందిన వివాహిత బుధవారం ఒంటరిగా ఉన్న సమయాన అదే గ్రామానికి చెందిన బి.కుమార్ ఇంట్లోకి జొరబడి లైంగిక దాడికి యత్నించగా ఆమె కేకలు వేయడంతో భర్త రాగానే పారిపోయాడు. అలాగే, ఎస్.వీ.బంజరకు చెందిన వివాహిత మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన జి.సతీష్ లైంగిక దాడికి యత్నించగా.. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

హాల్ టికెట్లు ఇప్పించి ఆదుకోండి..



వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల నుంచి హాల్ టికెట్లు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్‌కు విన్నవించారు. గురువారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో వినతిపత్రం సమర్పించిన అనంతరం పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మస్తాన్ మాట్లాడారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభంకానున్నందున పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు విద్యార్థుల ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, మణికంఠ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు వరం 'దళిత బంధు'



ట్రాక్టర్‌ను అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్‌నాయక్

కూసుమంచి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన దళితబంధు పథకం దళితులకు ఓ వరమని, దీన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని మల్లాయిగూడెం గ్రామానికి చెందిన వేముల వెంకయ్యకు దళితబంధు పథకం కింద మంజూరైన ట్రాక్టర్‌ను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీబ్లీ, ఉప సర్పంచ్ వీరనాగమ్మ, టీఆర్‌ఎస్ నాయకులు గుండు లింగయ్య, బదావత్ వెంకట్, రవి, వీరయ్య, శంకర్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దోరేపల్లి శ్వేత

ఖమ్మం స్పోర్ట్స్: దేశ ప్రగతిలో యువతి భాగస్వాములు కావాలని ఖమ్మం మార్కెట్ చైర్ పర్సన్ దోరేపల్లి శ్వేత అన్నారు. గురువారం నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్, నెహ్రూ యువక కేంద్రంలో సంయుక్తంగా నిర్వహించిన నైబర్‌హుడ్ యూత్ పార్లమెంటరీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు ప్రత్యేకమైన స్థానం ఉండడానికి కారణం యువతేనని తెలిపారు. అబ్దుల్‌కలాం స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువక కేంద్రం అధికారి చింతల అన్వేష్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఎన్.శ్రీనివాసరావు, నవభారత యువ చైతన్య సమితి అధ్యక్షుడు నూకల మోహన్‌కృష్ణ, రిసోర్స్ పర్సన్ సమన్వయకర్త సురేష్‌గుప్త, జిల్లా యువజన సంఘాల అధ్యక్షులు కోడిరెక్క ఉమాశంకర్, ఉషా, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలంలో ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ గురువారం పర్యటించి రూ.1.25 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం గోవింద్రాల గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు, నాయకులు అంతోటి అచ్చయ్య, ఎంపీపీ మాలోతు సునీత, వైస్ ఎంపీపీ అజ్మీర విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ తీర్థాల చిదంబరరావు, మల్లెంపాటి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు అజ్మీర రాందాస్, బాటోతు లూసి, గుగులోతు గబ్రు, లాకావత్ సునీత తదితరులు పాల్గొన్నారు.

'త్రివేణి'లో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వైద్యుడు వేణుగోపాల్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాలలో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కిడ్నీ ఆరోగ్యంపై అవగాహన సదస్సును నిర్వహించినట్లు డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా కిడ్నీ ప్రముఖ వైద్యుడు ఎల్.వేణుగోపాల్ మాట్లాడుతూ.. కిడ్నీ సంబంధిత వ్యాధులైన కిడ్నీలో రాళ్లు ఏర్పడటం, డయాలసిస్ తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, నివారణ చర్యల్లో భాగంగా మంచినీరు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో త్రివేణి –కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సీఆర్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్స్‌పై అవగాహన అవసరం




ఎస్‌బీఐటీలో అవగాహన కల్పిస్తున్న సంస్థ బాధ్యులు



ప్రియదర్శినిలో అవగాహన కల్పిస్తున్న సతీష్

ఖమ్మంసహకారనగర్/ఖమ్మంరూరల్: నగరంలోని ఎస్‌బీఐటీ, ఖమ్మంరూరల్ మండలంలోని పెద్దతండాలో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో హెల్సన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్లు గుండాల కృష్ణ, కె.నవీన్ బాబు మాట్లాడుతూ ప్రస్తుత సమాజం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవలపై ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐటీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రితో పాటు ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాజ్‌కుమార్, బి.గోపాల్, హెల్సన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రతినిధులు సతీష్, లోత్‌ఫలాహ్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్లు డాక్టర్ ఎ.వి.వి.శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ జి.సుభాష్‌చందర్, డాక్టర్ జె.రవీంద్రబాబు, టీపీవోలు సవిత, ఎ.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

జన హృదయ నేత 'రాయల'



రాయల అంతిమయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం: ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా నిత్యం ప్రజల మధ్య ఉంటూ జన హృదయాలలో నిలిచిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ రాయల నాగేశ్వరరావు అని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. గురువారం పిండిప్రోలులోని రాయల వెంకటనారాయణ భవనంలో పార్టీ డివిజన్ నాయకులు నిర్వహించిన గ్రామ సర్పంచ్ రాయల నాగేశ్వరరావు సంతాపసభలో పాల్గొని నివాళులర్పించాక మాట్లాడారు. అలాగే ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో పార్టీలకు అతీతంగా పనిచేసి జన హృదయ నేతగా గుర్తింపు పొందారని తెలిపారు. పార్టీ మండల కార్యదర్శి కమ్మకోమటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు గుర్రం అచ్చయ్య, పి.ప్రసాద్, పుసులూరి నరేందర్, సాధినేని వెంకటేశ్వరరావు, టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, రాయల రమ, రాయల చంద్రశేఖర్, రవికుమార్, చంద్ర అరుణ, ఆర్.శివలింగం, శిరోమణి, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల పీఏ నంద్యాల రవీందర్‌రెడ్డి, సీపీఎం జిల్లా నాయకులు బండి రమేష్, దొండేటి ఆనందరావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.అనంతరం వేలాదిమంది అభిమానులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు మధ్య అంతిమయాత్ర నిర్వహించారు.

అన్ని రంగాల్లోనూ అతివలు..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మహిళలకు సన్మానాలు, మొక్కలు నాటడం, చీరలు, కుట్టుమిషన్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల అవగాహన సదస్సులు నిర్వహించి మహిళల ప్రాధాన్యతను వివరించారు.

–ఖమ్మం మామిళ్లగూడెం/ ఖమ్మం వ్యవసాయం



ఖమ్మం మామిళ్లగూడెం: గాంధీపార్కులో చీరలు అందజేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ బాధ్యులు



వ్యవసాయ మార్కెట్‌లో మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ శ్వేత, మహిళా ఉద్యోగులు